క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో పలువురికి పదవులు

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళగిరి నియోజకవర్గానికి మంగళగిరి, తాడేపల్లి నగర డాక్టర్స్ విభాగం కమిటీలో పలువురికి పదవులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మంగళగిరి, తాడేపల్లి నగర అధ్యక్షులుగా మానెం బాలమురళీ కృష్ణ, ఉపాధ్యక్షులుగా పాగోలు కీర్తి, బొడ్డు నవీన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కాట్రగడ్డ పృథ్వీరాజ్, పాలేటి ప్రసంగి, చిలక వెంకట్రావు, గుజ్జుల ముఖేష్‌రెడ్డి, కాంద్రు వెంకటేశ్వరరెడ్డి, దల్లి భరతసింహారెడ్డి, కార్యదర్శులుగా ఎం.తేజశ్రీ, సురకాసి ప్రేమపల్లవి, ఎర్రెడ్ల ఉమామహేశ్వరి, ఇంకొల్లు వెంకట్రావు, మణుగూరు ప్రియాంక, కొల్లిపర నాగేంద్రబాబు, కాంద్రు జనార్ధన్‌రెడ్డి, కుంభా గీతాంజలి, కుంభాన రసింహారావు, షేక్ ఆదంషఫీ, సహాయ కార్యదర్శులుగా ఈడె రోజా, జంగం రమ్య, పాలపర్తి గోపిరాజు, సమేహాలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లి రూరల్: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ అక్కుల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేఎల్‌యూ రోడ్‌లోని విద్యుత్ లైన్ల మార్పిడి నిమిత్తం శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తాడేపల్లి మండల పరిధిలోని కుంచనపల్లి, గుండిమెడ, కొలనుకొండ, వడ్డేశ్వరం, ఇప్పటం గ్రామాల్లో వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని కోరారు.

మంగళగిరి పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ అక్కుల సత్యనారాయణ వేరొక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మార్పిడి నిమిత్తం నవులూరు, బాపూజీనగర్, శిబిరం ప్రాంతాలలో ఉదయం 9 గంటలకు మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పేద మహిళలకు చీరలు పంపిణీ

తాడేపల్లిరూరల్: క్రిస్మస్‌ను పురస్కరించుకుని మంగళగిరి రూరల్ పరిధిలోని నవులూరులో పేద మహిళలకు శుక్రవారం చీరల పంపిణీ చేశారు. దైవకృపా ప్రార్థనా మందిర పాస్టర్ దున్నా నాగయ్య ఆధ్వర్యంలో అందించారు. కార్యక్రమంలో ఏపీ చర్మకార సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు, మద్దాల శరత్‌బాబు, మద్దాల అరుణకుమారి పాల్గొన్నారు.

ఓబీసీ మండల చైర్మన్‌గా శ్రీనివాసరావు నియామకం

తాడేపల్లిరూరల్: ఓబీసీ మండల చైర్మన్‌గా ఎల్.శ్రీనివాసరావును నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ చైర్మన్ ఎం. వెంకటరావు శుక్రవారం ఆ ఉత్తర్వులను తాడేపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శ్రీనివాసరావుకు అందజేశారు.

జీజీహెచ్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆస్పత్రిలోని శుశ్రుత హాలులో జీజీహెచ్ నర్సుల అసోసియేషన్, హెడ్‌నర్సు రోజ్‌రాణి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభువైన యేసుక్రీస్తు శాంతమూర్తి అని, ఆయన బోధనలు అందరికీ అనుసరణీయమని తెలిపారు. ఒకరినొకరు అర్థం చేసుకుని సహనం, పట్టు విడుపులు ఉంటే జీవితం సాఫీగా నడుస్తుందని చెప్పారు. తొలుత సిబ్బంది పలు క్రిస్మస్ గీతాల్ని ఆలపించారు. క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్లు కె. ఆశా సజని, సమీనా బేగం, కిరణ్మయి, పద్మ, పాస్టర్ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

అరుణ్ కుమార్‌కు ఘంటసాల పురస్కారం



పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజంలో భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక, కాపునాడు సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం అమర గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు 101వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాయకులు ఘంటసాల పాటల్ని ఆలపించి ప్రేక్షకుల్ని అలరించారు. అనంతరం కళావేదిక వ్యవస్థాపకులు మిరియాల ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సామాజిక సేవాతత్పరులు నిశంకరరావు అరుణ్ కుమార్‌కు ఘంటసాల జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా జనసేన అధ్యక్షులు గాదె వెంకటేశ్వరావు, గుంటూరు జిల్లా కాపునాడు పార్లమెంట్ అధ్యక్షుడు మిరియాల గోపీకుమార్ పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు



వరి ధాన్యాన్ని తూకం వేస్తున్న దృశ్యం



వరి పంటను పరిశీలిస్తున్న ఆత్మ పీడీ రామాంజనేయులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమనిలో వరి, మినుము పంటలను శుక్రవారం ఆత్మ పి.డి. పి.రామాంజనేయులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ మిచాంగ్ తుఫాన్ కారణంగా 33 శాతం కంటే అధికంగా పంట నష్టం జరిగినట్లయితే పంట విస్తీర్ణం మొత్తం నమోదు చేసుకోవాలని, పంట సాగు చేసే వారి పేర్లను నమోదు చేయించుకోవాలని వివరించారు. అదే విధంగా పంట నష్టం నమోదు చేసిన నివేదికలను ఈనెల 18వ తేదీన సామాజిక తనిఖీ కోసం ఆర్‌బీకే, పంచాయతీల్లో అందుబాటులో ఉంచాలని కోరారు. గ్రామ సభ నిర్వహించి పొరపాట్లు ఉంటే సరిదిద్ది 26వ తేదీన తుది నివేదిక జిల్లా కలెక్టర్‌కు సమర్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఏఓ పి.శిరీష, వీఏఏలు రఫి, ప్రియాంక పాల్గొన్నారు.

రైతులు పంట నష్టాన్ని నమోదు చేయించుకోవాలి

తాడేపల్లిరూరల్: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో మంగళగిరి, తాడేపల్లి మండలాల్లో పంట నష్టపోయిన రైతులు వారి పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో పంట నష్టం వివరాలను నమోదు చేయించుకోవాలని మంగళగిరి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు గాయం శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. పంట దిగుబడి నష్టం 33 శాతం కన్నా అధికంగా ఉంటే ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద పరిహారం చెల్లిస్తుందని, ఈదురు గాలులు తీవ్రతకు మంగళగిరి, తాడేపల్లి మండలాల్లో వరి, మినుము, అరటి తదితర పంటలు నీట మునిగి, నేలకొరిగాయని, మంగళగిరి మండలంలోని 6,830 ఎకరాల వ్యవసాయ పంటలు, తాడేపల్లి మండలంలో 1710 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించినట్లు తెలిపారు. ఈనెల 18వ తేదీలోగా పంట నష్టం నమోదు ప్రక్రియ పూర్తి అవుతుందని, 18వ తేదీ నుంచి 22 వరకు నష్టపోయిన రైతుల జాబితాను రైతు భరోసా కేంద్రాల్లో, గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు.

పంటల బీమా రైతులు చెల్లించాల్సిన అవసరం లేదు : డెప్యూటీ డైరెక్టర్ సౌజన్య

తాడేపల్లిరూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించే పంటల బీమాకు రైతులు ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని డైరెక్టరేట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ డెప్యూటీ డైరెక్టర్ కె.సౌజన్య అన్నారు. శుక్రవారం ఎంటీఎంసీ పరిధిలోని ఇప్పటంలో వరి పంట కోత ప్రయోగాలను గొల్లపూడి డైరెక్టరేట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ ఉప గణాంక అధికారి ఎస్. శేషుబాబుతో కలసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడుతూ వరి పంట కోత ప్రయోగాలను ప్లాట్ నెం. 1,2 కింద నిర్వహించామని, రెండో ప్లాట్ వరి పంట కోత ప్రయోగం ఎకరాకు సుమారు 35 బస్తాలు దిగుబడి నమోదైందని, అదేవిధంగా ఒకటవ ప్లాట్ ప్రయోగంలో దిగుబడి సుమారుగా ఎకరాకు 5 బస్తాలుగా దిగుబడి అంచనా వేయడం జరిగిందని తెలిపారు. ఒక యూనిట్‌గా వరి పంటకు ఇప్పటంలో 4 పంటల కోత ప్రయోగాలు చేయడం జరిగిందని, సరాసరి దిగుబడిని బట్టి గ్రామంలోని రైతులకు పంట బీమా వర్తిస్తుందని తెలిపారు. ప్రభుత్వమే రైతుల తరఫున బీమా కడుతుందని, రైతులు ఒక్క రూపాయి కూడా చెల్లించనవసరం లేదని తెలిపారు. సీజన్‌లో పంట నమోదు చేయించుకున్న ప్రతి రైతుకు ఈ బీమా వర్తిస్తుందని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయ ఉప గణాంక అధికారి వి. విజయలక్ష్మి, డివిజన్ ఉప గణాంక అధికారి ఎం.డి. షబ్బీర్ అహ్మద్, తాడేపల్లి మండల సహాయ గణాంక అధికారి వెంకయ్య, ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు, గ్రామ వ్యవసాయ సహాయకులు యశ్వంత్, సాయి పాల్గొన్నారు.

వైభవంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ప్రసంగిస్తున్న దుగ్గిరాల ఎంపీపీ సంతోష రూపవాణి

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమ, చుక్కపల్లి వారి పాలెం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా ఎంపీపీ డి.సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ హాజరయ్యారు. ఈ సందర్భంగా దుగ్గిరాల గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఉజ్వల పథకం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్ పొందిన వారికి గ్యాస్‌స్టౌవ్, సిలెండర్, రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు సిద్దిల ఉజ్వల శ్రీహరిణి, దాసరిసుందరమ్మ, ఈమని 1వ ఎంపీటీసీ సభ్యులు పి. కృష్ణ చైతన్య, ఈమని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీవల్లి, వ్యవసాయశాఖ గుంటూరు జిల్లా ఆత్మ పీడీ రామాంజనేయులు, మహిళా శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్ భవాని, ఎయిడ్స్ వైద్యురాలు రష్మిత, ఏపీఎం మహాలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ శాంతకుమారి, నాగేశ్వరరావు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని పోలకంపాడు మండల ప్రజాపరిషత్ పాఠశాలలో శుక్రవారం ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓలు జి. శాంతకుమారి, డి.నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శాంత కుమారి మాట్లాడుతూ మండల పరిధిలోని భవిత పాఠశాలలో విద్యా కార్యక్రమాలు, నడవలేని పిల్లలకు ఫిజియోథెరపి, స్పీచ్ థెరపి సేవలు అందుబాటులో ఉన్నాయని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గొప్పగా ఎదిగిన థామస్ అల్వా ఎడిసన్, లూయీ బ్రెయిలీ, హెలెన్ కెల్లర్ తదితరుల జీవిత విశేషాలను ఎంఈఓ నాగేశ్వరరావు వివరించారు.

మదర్ థెరిస్సా హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫౌండర్ బి.పరమేష్ మాట్లాడుతూ చిన్నారుల రవాణా భత్యం, పేదరికంలో ఉన్న చిన్నారులకు ఆరోగ్యపరంగా ఇబ్బందులు పడుతున్న చిన్నారులకు ఆర్థిక సహాయం చేస్తామని అన్నారు అనంతరం చిన్నారులకు కేక్‌లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివరామకృష్ణ, ఉపాధ్యాయులు హరికృష్ణ, సునీతా కుమారి పాల్గొన్నారు.

నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలకు కొత్త రూపం

ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు



ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో హెచ్ఎం విజయలక్ష్మితో మాట్లాడుతున్న అంబటి రాయుడు

గుంటూరు ఎడ్యుకేషన్: నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్ని అన్ని హంగులతో ఆధునీకరించిన సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాలలకు కొత్త రూపం తెచ్చారని, ఆధునిక డిజిటల్ చదువుల్ని తెచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందని ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు పేర్కొన్నారు. చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నాడు–నేడుతో పాఠశాలలో కల్పించిన వసతులు, ఆధునీకరించిన పాఠశాల భవన సముదాయాన్ని పరిశీలించారు.

తరగతి గదుల్లో డ్యూయల్ డెస్కులు, ఐఎఫ్ ప్యానెల్స్ పనితీరును ప్రత్యక్షంగా తిలకించారు. ప్రభుత్వ పాఠశాలల్ని గతంలో తాము ఎన్నడూ ఇంత గొప్పగా, ఇన్ని వసతులతో చూడలేదని అన్నారు. తరగతి గదుల్లో ఆధునిక ఫర్నీచర్, ఐఎఫ్ ప్యానెల్స్‌తో పాటు విద్యుద్దీకరణ, ఫ్యాన్లు, ఎల్ఈడీ లైట్లతో విద్యార్థులు సౌకర్యవంతంగా కూర్చుంటున్నారని తెలిపారు. బ్లాక్ బోర్డు స్థానంలో ఐఎఫ్ ప్యానల్స్ ద్వారా ఉపాధ్యాయులు బోధన సాగిస్తున్న తీరు అద్భుతంగా ఉందని చెప్పారు. పేద విద్యార్థుల జీవితాలను మార్చే ఆధునిక డిజిటల్ టెక్నాలజీలతో కూడిన ఇంగ్లిష్ మీడియం చెప్పిస్తున్న సీఎం వై.ఎస్. జగన్ రాష్ట్రంలో చదువుల విప్లవం తెచ్చారని ప్రశంసించారు. అనంతరం పాఠశాలలో గార్డెన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఈడబ్ల్యూడీసీ చైర్మన్ నాగార్జున యాదవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి. విజయలక్ష్మి, ఉర్దూ డీఐ షేక్ మొహ్మద్ ఖాసిం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తైక్వాండో చాంపియన్‌షిప్‌లో విద్యార్థులకు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీనివాసరావు, నాగ సౌజన్య

గుంటూరు ఎడ్యుకేషన్: అంతర్ పాఠశాలల తైక్వాండో చాంపియన్‌షిప్‌లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపి పతకాలను కైవసం చేసుకున్నట్లు భారతి స్కూల్ డైరెక్టర్ బాపట్ల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ నాగ సౌజన్య తెలిపారు. శ్రీనగర్ ఏడో లైనులోని స్కూల్లో శుక్రవారం జరిగిన విద్యార్థుల అభినందన సభలో వారు మాట్లాడారు. కాశీనాథ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 9న జరిగిన తైక్వాండో చాంపియన్‌షిప్‌లో అండర్–8 విభాగంలో ఎం. తనుష, పి. ఇషా అలోకి రజత, ఎస్. సాజిదా కాంస్య, డి.సాహితి బంగారు పతకాలను సాధించినట్లు తెలిపారు.

అండర్–11 విభాగంలో షేక్ హనీఫా, ఐ. లక్ష్మీ దుర్గ, షేక్ ఖాజా ఫజల్ బంగారు, షేక్ ఎండీ మూసీ, షేక్ అనీఫ్, ఎం. సాత్విక్, సీహెచ్. వేదాంత రజత, పి. ఇషాన్ అధర్వ్ కాంస్య పతకాలు పొందారని పేర్కొన్నారు.

అండర్–14 విభాగంలో ఎస్. దుర్గేష్ బంగారు, ఐ. మహేష్‌బాబు కాంస్య పతకాలతో పాటు అండర్–17 విభాగంలో పి. వెంకటేష్, పి.తనుష్, షేక్ రసూల్, కె.వెంకటేశ్వర్లు బంగారు, పి. శ్రీకాంత్ రజత, ఎం. చైతన్య కాంస్య పతకాన్ని పొందారని తెలిపారు.

నవదిన ప్రార్థనలు ప్రారంభం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని బాల ఏసుదేవాలయంలో క్రీస్తు జయంతి మహోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం నుంచి 23వ తేదీ వరకు నవదిన ప్రార్థనలు నిర్వహించనున్నట్లు విచారణ గురువు పి.బాలస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిరోజు సాయంత్రం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారన్నారు. పి.బాలసాగర్ వాక్యోపదేశం చేస్తారని చెప్పారు. 16న చాట్ల మరియదాసు, 17న ఎం.ఫాతిమామర్రెడ్డి, 18న మర్రి అనిల్, 19న ఎం.బాలప్రసాద్, 20న టి.కరుణాకరరెడ్డి, 21న అల్లం చిన్నప్పరెడ్డి, 22న ఆర్.అనిల్‌కుమార్, 23న బి.మేఘానంద్ చక్రవర్తి వాక్యోపదేశం చేసి ప్రత్యేక దివ్యపూజాబలి నిర్వహిస్తారని తెలిపారు. 24న క్రీస్తు జయంతి సమిష్టి దివ్యపూజాబలి నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నట్లు చెప్పారు. 25న క్రీస్తు జయంతిని కొనియాడుతూ గుంటూరు పీఠాధిపతులు చిన్నాబత్తిని భాగ్యయ్య ప్రత్యేక దివ్యపూజా బలి నిర్వహిస్తారన్నారు. సాయంత్రం తేరుప్రదక్షిణ, కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తామని పేర్కొన్నారు.

శబరిమలకు తరలిన అయ్యప్పమాలధారులు

ఫిరంగిపురం: అయ్యప్పమాలధారులు శబరిమల శుక్రవారం తరలివెళ్లారు. ఫిరంగిపురంలోని కాళహస్తీస్వర స్వామి ఆలయం, నగరేశ్వరస్వామి ఆలయం, రేపూడిలోని కోదండరామాలయం, 113 తాళ్లూరులోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసిన అయ్యప్పమాలధారులు గురుస్వామితో ఇరుముడి ధరించి అయ్యప్పను దర్శించుకునేందుకు శబరిమలకు వాహనాలల్లో బయలుదేరి వెళ్లారు.

టేబుల్ టెన్నిస్‌లో ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభ



గుంటూరు రూరల్: క్రీడాకారులకు ఆత్మవిశ్వాసమే విజయానికి సరైన మార్గమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్ తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో శుక్రవారం జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సౌత్ జోన్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీలకు ఏఎన్‌యూ జట్టు తరఫున ఆడేందుకు తమ కళాశాల విద్యార్థినులు ఎన్నిక కావడం ఆనందంగా ఉందని తెలిపారు. ఇటీవల బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీల్లో తమ కళాశాల బాలికల జట్టు ప్రథమ స్థానం సాధించి రోలింగ్ ట్రోఫీని కైవసం చేసుకున్నట్లు చెప్పారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో భారతదేశ కీర్తి బావుటా ఎగురవేసే స్థాయికి విద్యార్థులు తయారవ్వాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన తమ కళాశాల విద్యార్థులు ఏ. శ్రీనిధి, డి.ఎ. బ్లేస్సీ ఈ నెల చెన్నైలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ ఇంటర్–యూనివర్సిటీ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తరఫున ఆడేందుకు ఎన్నికైనట్లు చెప్పారు.

కాకాని శివాలయంలో శాస్త్రోక్తంగా యాగాలు ప్రారంభం

పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి సన్నిధిలో శ్రీ కోటి లలితా నామ జప యజ్ఞ పూర్వక ఏకాథ కుండాత్మక సప్తమ సహస్ర చండీ, మహా రుద్ర , నవగ్రహ, లక్ష్మీ, గణపతి మహా యాగాలు బుధవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఏ ర్పాట్లను ఆలయ సహాయ కమిషనరు నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, పాలకమండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, పాలకవర్గం సభ్యులు పర్యవేక్షిస్తున్నారు. తెనాలికి చెందిన విష్ణుభట్ల ఆంజనేయచయనులు పర్యవేక్షణలో శుక్రవారం నుంచి ఆరు రోజుల పాటు పూజా క్రతువు నిర్వహించనున్నట్లు ఏసీ తెలియజేశారు. తొలిరోజు శుక్రవారం ఉదయం 8 గంటలకు గురువందనం, గోపూజ, యాగ సంకల్పం, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, లక్ష్మీగణపతి హోమం, చండీపారాయణములు, అఖండ దీపారాధన, జపాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం మంటపారాధనలు, కుండ సంస్కారం, అగ్నిప్రతిష్ఠాపన, మూలసూత్ర హోమం, సహస్ర చండీ సప్తశతి హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. పూజల్లో 50 మందికి పైగా ఋత్వికులు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాల తనిఖీ



మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేస్తున్న ఎం.డి.ఖాసిం

మేడికొండూరు: మండల పరిధిలోని తురకపాలెంలోని మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను ఉర్దూ పాఠశాల ఉప తనిఖీ అధికారి ఎం.డి.ఖాసిం శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులు పరిశీలించి, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. మూల్యాంకనం చేసిన సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్ష పత్రాలను విద్యార్థులకు ఇచ్చారు. శనివారం తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థుల హాజరుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. అమ్మ ఒడి అర్హులకు విద్యార్థుల హాజరు పరిగణలోకి తీసుకోవడం జరుగుతోంది, కాబట్టి తల్లిదండ్రులకు దీనిపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థుల హాజరు తగ్గకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలో జగనన్న గోరుముద్ద, మధ్యాహ్న భోజనం ఆహార పదార్థాలు పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్.లక్ష్మీజ్వాలా, అజీజ్, అయేషా, జాస్మిన్ పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపుతో బహుళ ప్రయోజనాలు

సీఆర్డీయే సర్కిల్ ఏడీ కోటేశ్వరరావు



స్వయం సహాయక సంఘాల మహిళలకు బల్బులు అందజేస్తున్న ఏడీ కోటేశ్వరరావు

తాడికొండ: విద్యుత్‌ను పొదుపుగా వాడటం ద్వారా బహుళ ప్రయోజనాలు పొందవచ్చని సీఆర్డీయే సర్కిల్ విద్యుత్ శాఖ ఏడీ కేవీ కోటేశ్వరరావు పేర్కొన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా తాడికొండ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యుత్ వినియోగం ద్వారా విద్యుత్‌ను ఆదా చేసే పలు పద్ధతులు వివరిస్తూ ఫిలైంట్ బల్బులు వాడకం పూర్తిగా తీసివేసి ఎల్ఈడీ స్టార్ రేటింగ్ బల్బులు, ఫ్యానులు వినియోగించాలని కోరారు. ఏసీని 25లో పెట్టి వినియోగించడం, 3 స్టార్, 4 స్టార్ రేటింగ్ ఏసీలు వినియోగించాలని, ఏసీ, టీవీ రిమోట్ ద్వారా కాకుండా స్విచ్‌ను కట్టివేయాలని పేర్కొన్నారు. పలువురు స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలకు స్టార్ రేటింగ్ ఎల్ఈడీ బల్బులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఏఈ రవి కుమార్, సబ్ ఇంజినీర్ నామా నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



సెమీ క్రిస్మస్ కేక్‌ను కట్ చేస్తున్న చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షులు గంజి చిరంజీవి తదితరులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని ఇమ్మానుయేలు చర్చిలో పాస్టర్ బొంతపురి రవి ప్రకాష్ ఆధ్వర్యంలో సెమీక్రిస్మస్ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గంజి చిరంజీవి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు మార్గం అనుసరణీయమని పేర్కొన్నారు. పాస్టర్ రవిప్రకాష్ మాట్లాడుతూ ప్రభువైన యేసుక్రీస్తు జన్మ ప్రపంచానికి శుభదినం అని ఆయన బోధించిన ప్రేమ, విధేయత, త్యాగం, సహాయం అమూల్య సందేశాలని అన్నారు. బిషప్ డాక్టర్ కత్తెర సుధీర్ కుమార్ మాట్లాడుతూ సమస్త మానవాళి విమోచన, రక్షణ కోసం యేసయ్య జన్మించి, మరణించి, తిరిగి లేచాని అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో పలువురు పాస్టర్లు పిల్లి దయా రత్నకుమార్, బేతాళ సాల్మన్‌రాజు, నండూరి బాలస్వామి, దున్నా నాగయ్య, గోనె లూథర్, పులి భాస్కరరావు, సూర్యచంద్రరావు, సంఘ పెద్దలు బంకా పార్థసారథి, పి. మరియమ్మ, కె. అచల రాణి, ఎం. ప్రశాంత్, యస్. దేవి, టి.అనుపమ పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలి: ఏపీటీఎఫ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బసవ లింగారావు

గుంటూరు ఎడ్యుకేషన్: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిల్ని చెల్లించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె. బసవ లింగారావు ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కోర్టు ఎదుట ఉన్న సంఘ జిల్లా కార్యాలయంలో శుక్రవారం గుంటూరు జోన్ కన్వీనర్ పి. నాగశివన్నారాయణ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో బసవ లింగారావు మాట్లాడారు. ఉపాధ్యాయులకు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిల్ని చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సరెండ్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బిల్లులు రెండేళ్ల క్రితమే పాస్ అయినప్పటికీ చెల్లింపులకు నోచుకోలేదని తెలిపారు. ఏపీజీఎల్ఐ, పీఎఫ్ రుణ చెల్లింపులు ఆర్నెల్లుగా నిలిచిపోవంతో దాచుకున్న సొమ్ము ఉపయోగపడటం లేదన్నారు. 11వ పీఆర్సీ బకాయిల చెల్లింపులు ఎప్పుడు జరుపుతారో తెలియని పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. 12వ పీఆర్సీని గత జూలై నుంచి మధ్యంతర భృతి ప్రకటించి అమలు చేయాలని, కేవలం కమిషన్ నియమించడం వల్ల ప్రయోజనం లేదని పేర్కొన్నారు. పాఠశాల నిర్వహణ నిధులు విడుదల చేయకపోవడంతో విద్యుత్ బిల్లులు తడిపి మోపెడవుతున్నాయని, కనెక్షన్లు తొలగిస్తామని విద్యుత్ శాఖాధికారులు హెచ్చరిస్తున్నారని తెలిపారు. సమావేశంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాలీద్, జిల్లా కార్యదర్శులు పి.శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి, జి.దాసు, జోసెఫ్ కిరణ్, మాణిక్యాలరావు, జిల్లా కౌన్సిలర్లు పి.లక్ష్మీనారాయణ, పార్వతి, కుటుంబరావు, గౌస్, కోటేశ్వరరావు, వేణు, శివశంకర నాయక్ పాల్గొన్నారు.

దివ్యాంగులు మనోధైర్యంతో ఎదగాలి



గుంటూరు ఎడ్యుకేషన్: దివ్యాంగులు శారీరక వైకల్యాన్ని మరచి మనోధైర్యంతో ఎదగాలని గుంటూరు తూర్పు ఎంఈవో–2 కె.నాగేంద్రమ్మ పేర్కొన్నారు. రాజాగారితోటలోని నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక అవసరాల బాల, బాలికల దినోత్సవ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో నాగేంద్రమ్మ శారీరక, మానసిక వైకల్యంతో జన్మించిన చిన్నారులకు సమగ్ర శిక్ష ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలు, ఉపకరణాల గురించి తెలియజేశారు. న్యూరాలజిస్ట్ డాక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలోని భవిత కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాల్ని సద్వినియోగం చేసుకోవాలని చిన్నారుల తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం పాఠశాలకు చెందిన విభిన్న ప్రతిభావంతుడైన ఉపాధ్యాయుడు నూతలపాటి వెంకటేశ్వర్లును సన్మానించారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం జె. గురుబ్రహ్మం, ఉపాధ్యాయులు జి.వి.శ్రీధర్, భారతి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.